31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం మే 17 2026 పేజీలు 8

## మహిళా సాధికారత లక్ష్యంగా ముందుకు

◆రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 :** మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లి, దోమలకుంట గ్రామాల్లో మహిళా సంఘాల వీఓ భవనాలకు మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను లక్ష్యంతో సీఎం రేవంత్రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని లక్ష్యంతో -2లో

## సమాచార హక్కు చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం

◆రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి

◆జగిత్యాల కలెక్టరేట్‌లో ఆర్.టీ.ఐ చట్టంపై పీఐఓలు, ఏపీఐఓలకు అవగాహన సదస్సు



**చురకలు విలేకరి, జగిత్యాల, మే 16 :** ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమాచార హక్కు చట్టం - 2005 పై పీఐఓలకు, ఏపీఐఓలకు మరియు అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, సమాచార కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్ లు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమాచార చట్టం అవగాహనా సదస్సుకు హాజరైన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి, కమిషనర్లు దేశాల భూపాల్, పీ.వీ.శ్రీనివాస్ రావులు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పూల మొక్క అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం ప్రజలకు సంబంధించినదే అయినందున దానిని వారికి తెలుపడంలో అలసత్వ వైఖరి తగదని హితవు పలికారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజాసేవకులం అన్న విషయాన్ని మరువరాదని సూచించారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంలోని 2 షెడ్యూళ్ళు, 6 చాప్టర్లు, 31 సెక్షన్ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు సంబంధించి పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓల సందేహాలకు తగిన సూచనలు అందించారు. థర్డ్ పార్టీ ఇన్ఫర్మేషన్, వ్యక్తిగతంగా అడిగే సమాచారం, ఇవ్వవలసిన సమాచారం, ఇవ్వకూడని సమాచారం, తదితర వాటి గురించి సవివరంగా తెలియజేశారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత పీఐఓలు, ఏపీఐఓలకు ఉందని అన్నారు. సమాచార చట్టం ప్రకారం సమాచారాన్ని కోరే హక్కు ప్రతి పౌరునికి ఉండడంతో పాటు, రికార్డులను, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించే అధికారం కూడా ఉందని తెలిపారు. పౌరులు కోరినప్పుడే సమాచారం ఇవ్వడం కాకుండా, సమాచార హక్కు చట్టం, సెక్షన్ 4(1)బి ప్రకారం స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చేలా అధికార యంత్రంగాలు సమాయత్తం కావాలని సూచించారు. పబ్లిక్ అథారిటీ బాధ్యతలు, విధులు, నిర్వర్తించే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు 4(1) బి రిజిస్టర్లను అప్డేట్ చేసుకోవాలని, వీటన్నిటిని ప్రజలకు తెలిసేవిధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం లక్ష మందికి సమాచారం అందించడం జరిగిందని తెలిపారు. మరో 15000 వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 20 జిల్లాలలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని, సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరుకున్న సమాచారాన్ని పొందే అవకాశం ఉన్నందున పిఐఓలు, అధికార యంత్రంగాలు ప్రజల పక్షాన ఆలోచించి అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని అన్నారు. సమాచార కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమలు, ఉద్దేశ్యాలు, 4(1)బి కింద ఇచ్చే సమాచారం తెలియజేస్తూ ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో వివరాలను అప్డేట్ చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగాలపై ఉందని సూచించారు. సమాచార హక్కు చట్టంలోని 6(3) కింద దరఖాస్తును చక్కగా చదివి ఆకళింపు చేసుకోవాలని, ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ సరైన రీతిలో స్పందిస్తే సెకండ్ అప్పీలేట్ అథారిటీ వరకు అప్పీల్స్ అన్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులు అనగానే అనేక మంది ఆందోళనకు గురి అవుతారని, ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురి కాకుండా దరఖాస్తుదారు కోరిన మేరకు రికార్డులలో ఉన్న సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ కేసులను ఆర్.టీ.ఐ కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లు పరిశీలించి పరిష్కరించారు. రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమలు భారతదేశంలో అమలు చేస్తున్న వివరాలు -2లో

## విద్యాలయాలకు స్థల కేటాయింపుకు జీవో జారీ

◆ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 :** జగిత్యాల జిల్లాకు మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయానికి స్థలాన్ని కేటాయిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ శనివారం హైద్రాబాద్లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధరాబాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలను కలిసి జగిత్యాలకు మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రులు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ కు చల్గల్ గ్రామంలోని వాలంతరీకి చెందిన 10 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి 2 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ కు 10 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి స్థలాన్ని 2 ఎకరాల స్థలాన్ని కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమకుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్లకు కృతజ్ఞతలు తెలిపారు.



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

◆రైస్ మిల్లుల వద్దా ధాన్యం 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి

◆జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత



**చురకలు విలేకరి, కొడిమ్యాల, మే 16 :** ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, రైస్ మిల్లుల వద్దా ధాన్యం 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత అన్నారు. శనివారం కొడిమ్యాల మండలం నాచుపెల్లి గ్రామం లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, శ్రీ రామాంజనేయు రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత -2లో

## జూన్ రెండవ వారానికల్లా తెలంగాణాకు నైరుతి రుతుపవనాలు

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మే 16 :** తీవ్రమైన ఎండలతో అల్లాడి పోతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ తీపి కబురు అందించింది.నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం అండమాన్ దీవులను తాకాయని, మే 26 వరకు కేరళ రాష్ట్రాన్ని తాకి జూన్ మొదటి వారం లో ఆంధ్రప్రదేశ్, రెండవవారంలో తెలంగాణా రాష్ట్రానికి నైరుతి రుతుపవనాలు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖతెలిపింది. శనివారం జగిత్యాల జిల్లాలో తీవ్రమైనఎండతో పాటువడగాల్పులు వీయడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.మండల కేంద్రం వెల్గటూర్ లో ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరగడం సాయంత్రం 6 గంటల వరకువేడి,వడగాల్పులు తగ్గక పోవడంతో ప్రజలుఇండ్లకే పరిమిత మయ్యారు.కూలర్లు,ఏసీల వద్దనే సేదదీరారు.వేడిమితట్టుకోలేక ప్రజలు బయటికి వెళ్లక పోవడంతో వ్యాపారస్థులు దుఖాణాలను మూసివేయడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. హీట్ వేవ్స్ తో అల్లాడిపోతున్న రాష్ట్ర ప్రజలు జూన్ రెండోవారం వరకు ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి నెలకొంది.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. అనంతరం రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచాలని ధాన్యం తో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్లోడ్ అయ్యే విధంగా చూడాలని రైస్ మిల్లర్లు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ధాన్యం అన్లోడింగ్ లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, డిటి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత లక్ష్యంగా ముందుకు

**మొదటి పేజీ తరువాయి...**మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు అందజేసి వారి ఆర్థిక ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. సుద్దపల్లి గ్రామంలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో వీఓ భవనం, దోమలకుంట గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో వీఓ భవనానికి శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని మహిళా సంఘాలకు వివో భవనాలు నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి మండల నాయకులు, గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం



**మొదటి పేజీ తరువాయి...**తెలియజేస్తూ అధికార యంత్రంగాలు, పిఐఓలు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 1766 లోనే స్వీడన్ దేశంలో సమాచార హక్కు చట్టం అమలు ప్రారంభమైందని, 2005 సంవత్సరంలో భారతదేశంలో ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రపంచ దేశాల పరంగా చూస్తే ఆర్.టీ.ఐ అమలు విషయంలో భారతదేశం 4వ స్థానంలో ఉందని, దీని అమలును మరింత సమర్ధవంతంగా చేస్తూ మన దేశాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు అంకితభావం తో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కేవలం కార్యాలయ విధుల్లో మాత్రమే కాకుండా ప్రతి ఉద్యోగి వ్యక్తిగత జీవితంలో కూడా పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి, నైతిక విలువలను పెంపొందించే ముఖ్యమైన చట్టమని పేర్కొన్నారు.ప్రతి ఉద్యోగి కూడా కార్యాలయంలోని విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని సమాచార హక్కు చట్టం ఫిర్యాదులకు సకాలంలో స్పందించి వీలైనంత త్వరగా సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, వివిధ స్థాయిల జిల్లా శాఖల అధికారులు, జిల్లా, డివిజనల్, మండల స్థాయి అప్పీలేట్ అథారిటీలు, పీఐఓలు, ఏపీఐఓలు, మరియు ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపునకు సరిపడా లారీలను కేటాయించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 16 :** ప్రభుత్వం రైతు సంక్షేమం కొరకు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యం తరలింపుకు సరిపడా లారీలను కేటాయించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి వరి ధాన్యం తరలింపునకు లారీలను కేటాయించే గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి నిబంధనలకు అనుగుణంగా తాలు, తప్ప, ఎలాంటి మట్టి గడ్డలు లేని, నిర్దేశిత తేమ శాతంతో నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు చేసి తరలించే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం తరలింపుకు సరిపడా లారీలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని,లేని పక్షంలో సంబంధిత గుత్తేదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అనంతరం జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో ఐకెపి, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసీల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల వద్ద నుంచి నిబంధనలు మేరకు ఎఫ్ ఏ క్యూ ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు, నీడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని, రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాలకు తప్ప, తాలు, మట్టి గడ్డలు లేని ధాన్యాన్ని తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో ఉంచిన ప్యాడి క్లీనర్లు, తేమ శాతం తెలిపే పరికరాలు, టార్పాలిన్లు, ఇతర పరికరాలను ఉపయోగించుకోవాలని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ కోరుట్ల టౌన్ అధ్యక్షునిగా తిరుమల గంగాధర్ నియామకం

**-పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్న గంగాధర్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, మే 16 :** కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షునిగా తిరుమల గంగాధర్‌ను మరోసారి నియమించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనంద వాతావరణం నెలకొంది. పార్టీ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, నాయకత్వ లక్షణాలు, కార్యకర్తలతో సమన్వయం చేసుకునే తీరు దృష్ట్యా ఈ బాధ్యతలను మరోసారి అప్పగించినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తిరుమల గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు ఆయనను పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. గంగాధర్ గతంలో కూడా టౌన్ అధ్యక్షునిగా పనిచేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని నాయకులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా తిరుమల గంగాధర్ మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు తనపై మరోసారి నమ్మకం ఉంచి టౌన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతను పార్టీ వైపు ఆకర్షిస్తూ, ప్రతి వార్డులో పార్టీ కార్యకలాపాలను విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తిరుమల గంగాధర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### మెట్‌పల్లి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా

# మొహమ్మద్ రైసోద్దీన్ నియామకం





**చురకలు ప్రతినిధి కోరుట్ల మే,16 :** కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మెట్‌పల్లి టౌన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మొహమ్మద్ రైసోద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు మే 06న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు సిఫార్సుల మేరకు, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఈ నియామకానికి ఆమోదం తెలుపుతూ ఆదేశాలు జారీ చేశారు.ఈ విషయాన్ని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య అధికారికంగా వెల్లడించారు. కోరుట్ల నియోజకవర్గ వ్యాప్తంగా నూతన అధ్యక్షులను నియమిస్తూ అధిష్టానం జాబితాను విడుదల చేయగా అందులో మెట్‌పల్లి టౌన్ బాధ్యతలను మొహమ్మద్ రైసోద్దీన్‌కు అప్పగించారు.పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు అంకితభావంతో పనిచేయాలని టీపీసీసీ ఆకాంక్షించింది.మెట్‌పల్లి టౌన్ అధ్యక్షుడిగా మొహమ్మద్ రైసోద్దీన్ నియామకం పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో మెట్‌పల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మొహమ్మద్ రైసోద్దీన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు కి, జువ్వాడి కృష్ణారావుకి,జువ్వాడి శేఖర్ రావుకి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్యకి తదితర పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి 24 గంటలు కృషి చేస్తానని , చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని మతాలు, కులాలు, వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటా నని ఆయన పేర్కొన్నారు. జువ్వాడి నర్సింగరావు నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి తన వంతు సేవలు అందిస్తానని తెలిపారు.

# మక్క రైతుకు అష్ట కష్టాలు...!

**- కొనుగోళ్లలో జాప్యంతో తీవ్ర ఆందోళన**
**- గన్నీబ్యాగుల కొరతతో నిలిచిన కాంటా**
**- ఇబ్రహింపట్నం మార్కెట్‌లో పేరుకుపోయిన మక్కల రాసులు**
**- ఎండకు ఎండి, వర్షానికి తడుస్తున్నాయని వాపోతున్న రైతులు**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మే (16) :** సకాలంలో మక్కల కొను గోళ్లు జరగక మక్క రైతులు కష్టాలతో విలవిలలాడుతున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎటు చూసిన మెక్కజోన్న రాసులు దర్శనం ఇస్తున్నయి.సకాలంలో మక్కలు కొనడంలేదని మొక్కజొన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గన్నీ బ్యాగుల కొరతతో మార్కెట్ యార్డులో మక్కల కొనుగోళ్లుపూర్తిగా నిలిచి పోయాయి.దీంతో యార్డులో పోసిన మక్కల రాసులు ఎక్కడికక్కడే పేరుకు పోయాయి.చాలామంది రైతుల మక్కల కు తేమశాతం వచ్చినప్పటికీ గన్నీ సంచులు లేక కాంటాలు పెట్టడం లేదు.ఇరవై రోజుల క్రితం వచ్చిన రైతులు కూడా కాంటాలు సకాలంలో పెట్టకపోవడంతో యార్డులోనే నిరీక్షించా ల్సివస్తోంది.మక్కల కొనుగోళ్లలో అధికారులు చేస్తున్న జాప్యం రైతులకు శాపంగా మారింది.ఒకవైపు తీవ్ర ఎండ ,మరో వైపు భారీగా వర్షాలతో రైతులు తమపంటను కాపాడుకునేందుకు సతమతమవుతున్నారు.

**పెరుకు పోయిన మెక్కజోన్న రాసులు....**

అధికారులు సకాలంలో మక్కలు కొనకపోవడంతో ఇబ్రహింపట్నం మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా మక్కల రాసులే కనిపిస్తున్నాయి.15 రోజులుగా మక్కలకు మాయిశ్చర్ సైతం వచ్చినా కొనలేదు. ఆదివారం కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దయ్యాయి. దీంతో సోమవారం ఉదయం నుంచి మక్కలను మళ్లీ ఎండబెట్టుకోవాల్సి వస్తోంది.అధికారులు సకాలంలో మక్కలు కొంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సుమారు నెల రోజులుగా కేవలం 550 మంది రైతుల 41వేల క్వింటాళ్ల మక్కలు మాత్రమే కొన్నారు. కొనుగోలు చేసిన మక్కలకు ఇప్పటి వరకు చెల్లింపులు జరగక పోవడం గమనార్హం.

**మార్కెట్ యార్డు రహదారి పైన రైతుల నిరసన...**

గత కోన్ని రోజులుగా మక్కలు కొనుగోలు నత్తనడకన జరగటం తో మక్క రైతులు సోమవారం మార్కెట్ రహదారి పైన గత ఐదురోజుల క్రితం ఆందోళనకు దిగారు. వెంటనే మక్కల కొనాలని డిమాండ్ చేశారు.జిల్లా రైతు ఐక్య వేదిక అధ్యక్షుడు నల్ల రమేష్ రెడ్డి తదితరులు రైతులకు మద్దతు తెలిపారు. వెంటనే గన్నీ సంచులు ఇచ్చి మక్కలు కొనుగోలు చేయాలన్నారు.ఆందోళన వద్దకు చేరుకున్న తహశీల్దార్ వర ప్రసాద్ రైతులతో మాట్లాడి కోనుగోలు సక్రమంగా జరిగెల చుస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమిం చారు.అయిన కోనుగోల్లలో తిరుమారక పోవటం పట్ల రైతులు ఆవేధన.వ్యక్తం చెస్తున్నారు.

**గన్ని సంచులు కోనుకున్న రైతులు...**

మక్కల కొనుగోలుకుగన్నీ సంచులు రావని, రైతులే కొనుక్కోవాలని మార్కెట్ యార్డు లో నిర్వహకులు చెప్పడంతో రైతులు అయోమయానికి గురయ్యారు. రెండు రొజులుగా ఉదయం రైతులనే గన్నీ సంచులు తెచ్చుకోవాలని చెప్పడం తో కొందరు ఏంచేయాలో తెలియక ఇబ్బందిపడ్డారు. ఒక్కో గన్నీ సంచికి రూ.32 చొప్పున కోనుకోని వచ్చి మెక్కజోన్న కాంటలు వేయించుకుంటు న్నరు.సంచులు దొరకని వారికీ నిరిక్షణ తప్పటం లేదు.

**అందుబాటులో ఉన్న గోదాం నిల్వలు చెయ్యాలి...**

మక్కలకు ఎలాంటి జాప్యం లేకుండా చుడాలని మెట్ పల్లి ఆర్ డిఓ నర్సంహరావు అన్నారు.వ్యవసాయ మార్కెట్‌యార్డు సమిపంలో ఉన్న గోదాంలో నిల్వలు చెసుకోని రైతులకు ఇబ్బందులు కలగకుండా చుడాలని తహసీల్దార్ వరప్రసాద్‌కు సుచించారు.

**25 రోజుల క్రితం మార్కెట్లో మక్కలు పోశాను**

**గుడాల సాయన్న రైతు - ఇబ్రహింపట్నం**

ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డ్ లో తోటలో పండించిన మక్కలు అమ్మకా నికి తీసుకొచ్చాను ఇప్పటికీ కొనుగోలు జరగడం లేదు.ఎండకి ఎండి వానకు తడుస్తున్నాయి.అధికారులు వస్తున్నారు కానీ కొనుగోలు జరపడం లేదు.

**రోజు మక్కల వద్దకే రావాల్సి వస్తుంది**

**గుడిమెనక గంగాధర్ రైతు - ఎర్దండి**

మక్కలు విక్రయించేందుకు ఇబ్ర హింపట్నం మండల కేంద్రంలో ఒక్కటే కోనుగోలు కేంద్రం ఉంది రోజు వచ్చి మక్కలను విక్రయం చెసెందుకు నిరిక్షణ తప్పటం లేదు.వర్షంకు తడిసి ఎండకు ఏంటి కుప్ప అరబోయడంతో సరిపోతుంది.

**గన్ని సంచులు కొనుక్కున్నాను**

**అన్నారపు రాజ రెడ్డి రైతు - వేములకుర్తి**

కొనుగోలు కేంద్రంలో మక్కలు విక్రయం కోసం రోజుల తరబడి నిరీక్షించిన పలితం లేకపోవడంతో గన్ని సంచుల కొరత ఉందని నిర్వాహకులు సూచించడంతో మక్కలవిక్రయం కోసం గన్ని సంచులు కొనుక్కొని మరి తూకం వేయిచుకున్నా అధిక భారం పడింది.

# జాప్యం లేకుండా కొనుగోలు వేగవంతం చేయాలి

**-మాజీ జడ్పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 :** ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు వేగవంతం చేయాలని మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. గ్రామంలోని మార్కెట్ యార్డులో పోసిన వరి ధాన్యాన్ని బిఆర్ఎస్ నాయకులు, రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వడ్లు పోసి దాదాపు నెల రోజులు గడుస్తున్నాయని, ఈ సంవత్సరం వాతావరణ శాఖ అంచనా ప్రకారం రుతుపవనాలు తొందరగా వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు వేగవంతం చె యాలన్నారు. గన్ని బ్యాగులు మరియు లారీల కొరత ఉన్నదాన్ని ఇక్కడ రైతులు అంటున్నారు జిల్లా యంత్రాంగం అధికారులు స్పందించి ఒక ప్రణాళిక బద్ధంగా కొనుగోలు సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగే విధంగా చూడాలన్నారు.అకాల వర్షాలు వస్తే రైతులు రైతులు తీవ్రంగా నష్ట పోతారని,కొనుగోలును వేగవంతం చేయాలన్నారు.ఆనాడు బిఆర్ఎస్ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఘనత రైతు నాయ కుడు కేసిఆరదన్నారు. గత ప్రభుత్వంలో కొనుగోలు ఏ విధంగా జరిగిందో అదే విధంగా జరగాలన్నారు. రైతులకు నీటి కష్టాలు కరెంటు కష్టాలు తొలగాలని కేసిఆర్ 24 గంటల కరెంటు ఇచ్చి కాలేశ్వరం లాంటి ప్రాజె క్టులు కట్టి అన్నదాతలను ఆదుకొని భూమికి భార మయే అంత పంట తెలంగాణ రాష్ట్రం లో పండుతుం దన్నారు.ఈ కార్యక్రమం లో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్ రావు,శీలం ప్రవీణ్,ఎల్లా రాజన్న, ముత్యం రమేష్,వెంకటేష్,యోహన్, కిషోర్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ జర్నలిస్టు అందుకున్న ఫజల్ బేగ్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 :** సిఈటిఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డు 2025 కార్యక్రమంలో శనివారం జగిత్యాలకు చెందిన పాత్రికేయుడు మీర్జా ఫజల్ బేగ్ ఉత్తమ



జర్నలిస్టు అవార్డును అందు కున్నారు.ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఇమ్రాన్, టియు డబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస్ రావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, జర్నలిస్టులు రంగారావు,ముజాహిద్ ఆదిల్, ఇమ్రాన్ జైన్,బండ స్వామి, జహీర్, మోసిఖ్, హైదర్,నజీమ్, సులేమాన్లు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# సమ్మర్ క్యాంపుకు విశేష స్పందన



**చురకలు విలేఖరి ఇబ్రహీంపట్నం మే (16) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపు కు విశేష స్పందన ఉంది.శనివారం సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు అబాకస్, ఈజీ మ్యాథమెటిక్స్, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్, చెస్, క్యారం వివిధ రకాల ఆటలు ఆడిస్తున్నందున విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో జాయిన్ అవుతున్నారు. విద్యార్థులకు స్నాక్స్ కూడా అందిస్తున్నారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి బండారి మధు మాట్లాడుతూ ఇంకా విద్యార్థులు చేరడానికి అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో సి ఆర్ పి రవీందర్ , రిసోర్స్ పర్సనులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**-మంత్రి లక్ష్మణ్ కుమార్**



**చురకలు విలేకరి ఎండపల్లి, మే 16 :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కొత్త-పాత తేడా లేకుండా ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన గెల్లు చంద్రశేఖర్‌కు రాజారాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన మండల అధ్యక్షుడు మండలంలోని అన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ అధిష్టానం మార్గదర్శకాలను పాటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని చెప్పారు.గతంలో పనిచేసిన నాయకులను, కార్యకర్తలను విస్మరించకుండా పార్టీ నియమాలకు లోబడి పనిచేస్తూ రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు చేర్చాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో.వెల్గటూర్ మండలా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలంధర్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి,సర్పంచులు జీరెడ్డి మహేందర్ రెడ్డి.కొంగల జగదీశ్వర్ రెడ్డి, మహ్మమ్మద్ అభి,బుసరపు అశోక్,పోలోజు శ్రీనివాస్,సత్యం,గెల్లు శ్రీనివాస్,గాజుల విజయ్,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మచ్చ నారాయణ

**చురకలు విలేకరి, రాయికల్, మే 16 :** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాయికల్ పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు మచ్చ నారాయణ నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు,ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ లు నియామకాన్ని ప్రకటించారు. తపై నమ్మకం వుంచి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు,ఎంపీ ధర్మపురి అర్వింద్,నియోజక వర్గ ఇంచార్జ్ బోగా శ్రావణి,జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు,పట్టణ శాఖ అధ్యక్షులు మల్లారెడ్డి,మండల అధ్యక్షులు ఆకుల మహేష్, బిజెపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## తహసీల్దార్, ఎస్ఐలకు మెడికల్ అసోసియేషన్ వినతి



**చురకలు విలేకరి, ధర్మపురి, మే 16 :** ధర్మపురి తహసీల్దార్, శ్రీనివాస్, ఎస్ఐ జి.మహేష్ లకు మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈనెల 20న చేపట్టనున్న మెడికల్ షాపుల ఒకరోజు దేశవ్యాప్త బంద్ గురించి ముందస్తు సమాచారాన్ని తెలిపారు. మెడికల్ అసోసియేషన్ డిమాండ్లకు మద్దతుగా జోక్యం చేసుకుని సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్మపురి పట్టణంలోని అపోలో మెడికల్ బంద్కు సహకరించాలని కోరారు. దీర్ఘకాలిక రోగులు ముందస్తుగా మందులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మెరుగు శ్రీనివాస్, కుమ్మరి లక్ష్మణ్, వావిలల గంగాధర్, వరప్రసాద్, సంగి మోహన్, రత్నాకర్, పంబాలరవి, ఆకుల రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయున్ని పరామర్శించిన మంత్రి అడ్లూరి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 :** ధర్మపురికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సురేందర్ కుమార్ ను రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ఉదయం సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రి లో పరామర్శించారు. సురేందర్ కుమార్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా ఇటీవల వైద్యులు శస్త్రచికిత్స జరుగగా, ఆసుపత్రిలో సురేందర్ కుమార్ను పరామర్శించిన మంత్రి అడ్లూరి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్టుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న సురేందర్ కుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించినట్లు మంత్రి తెలిపారు.

# టీజీఎన్పీడిసిఎల్‌లో వన్ మినిట్ రూల్ అమలు

**-సిబ్బంది భద్రతకు మరింత పటిష్ట చర్యలు**
**-టీజీఎన్పీడిసిఎల్ సూపెరిండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 :** జగిత్యాల సర్కిల్ పరిధిలో విధులు నిర్వహించే సిబ్బంది భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ వన్ మినిట్ రూల్ పేరుతో ప్రత్యేక భద్రతా విధానాన్ని అమలు చేస్తున్నట్లు సూపెరిండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించే ముందు ప్రతి ఉద్యోగి కేవలం ఒక నిమిషం సమయం తీసుకుని భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించడం ఈ విధానంలోని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ ప్రత్యేక భద్రతా విధానం ద్వారా విద్యుత్ ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం, సిబ్బంది ప్రాణాలను రక్షించడం, విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సురక్షితంగా నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకొని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఈ కొత్త ఆలోచన విధానాన్ని తీసుకువచ్చారని తెలిపారు. వన్ మినిట్ రూల్ తీసుకురావడంలో సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉన్నందున, ఈ ఒక్క నిమిషం జాగ్రత్త సిబ్బంది ప్రాణాలను కాపాడగలదని ఆయన పేర్కొన్నారు. వన్ మినిట్ రూల్ లో భాగంగా లైన్ క్లియర్ పొందిన విషయాన్ని నిర్ధారించుకోవడం, ఇండక్షన్ టెస్టర్తో లైన్లో విద్యుత్ సరఫరా లేదని పరీక్షించడం, వ్యక్తిగత రక్షణ పరికరాలు సరిగా ధరించడం, ఎర్తింగ్ వ్యవస్థ సక్రమంగా ఏర్పాటు చేయడం, పని ప్రదేశంలో ఇతర ప్రమాదాల అవకాశాలు ఉన్నాయా అన్నది పరిశీలించడం, డబుల్ ఫీడింగ్ జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవడం, టీమ్ సభ్యులందరూ అప్రమత్తంగా ఉన్నారో లేదో నిర్ధారించుకోవడం, పనికి ఉపయోగించే పరికరాలు సురక్షిత స్థితిలో ఉన్నాయో లేదో పరిశీలించడం, భద్రతే మొదటి ప్రాధాన్యత, టీజీఎన్పీడీసీఎల్లో ప్రతి ఉద్యోగి వన్ మినిట్ రూల్ను తప్పనిసరిగా పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు, భద్రతా శిక్షణలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భద్రతా నియమాలను కచ్చితంగా అమలు చేస్తే విద్యుత్ ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చని ఆయన అన్నారు. ఒక్క నిమిషం ఆలోచన-జీవితాంతం భద్రతఅనే సందేశంతో వన్ మినిట్ రూల్ను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.

# వృద్ధుల పోషణ విస్మరిస్తే జైలుకే

**-జగిత్యాల ఆర్డీవో పి. మధుసూదన్**



**చురకలు విలేకరి,జగిత్యాల,మే 16 :** వృద్ధ తల్లిదండ్రుల పోషణ విస్మరించి, వేధింపులకు గురిచేస్తే వారి కొడుకులకు,కోడళ్ళకు,కూతుర్లకు,వారసులకు జైలు శిక్ష విధిస్తామని,తల్లి దండ్రుల నుంచి కొడుకులు,కూతుర్లు పొందిన ఆస్తులను తిరిగి వారి తల్లిదండ్రుల పేరిట పట్టా మార్పిడి జరుగుతుందని జగిత్యాల డివిజన్ వయో వృద్ధుల సంరక్షణ ట్రిబ్యునల్ అధికారి ఆర్డీవో పి.మధుసూదన్ హెచ్చరించారు. శనివారం వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆర్డీవో మధుసూదన్ రాయికల్ మండలం మూటపల్లి గ్రామానికి చెందిన ఏనుగు లింగారావు, సారంగపూర్ మండలం కొనాపూర్ గ్రామానికి చెందిన గడుప బక్కవ్వ,జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన మతులాపురం రాజం అనే వృద్ధుల కేసుల్లో కొడుకులు, కూతుర్లు ,కోడళ్ళను,అల్లుళ్లను,వారసులను విచారించారు.సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ వృద్ధ తల్లిదండ్రుల పక్షాన వాదనలు వినిపిస్తూ న్యాయం చేయాలని కోరారు.విచారణకు హాజరు కాని వారికి సైతం చట్ట పరమైన చర్యలకు ఆర్డీవో నోటీసులు జారీచేశారు.విచారణల్లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్,కాన్సిలియేషన్ అధికారులు పి. సీ.హన్మంత్ రెడ్డి,వెల్ముల ప్రకాష్ రావు,వృద్ధుల చట్టం సీనియర్ సహాయకురాలు పద్మజ పాల్గొన్నారు.

## బాధ్యత మరువకుండా బతికపల్లి సమస్యలు తీరుస్తా

**-ప్రత్యేక నిధులతో రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తా**
**-రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 :** ధర్మపురి నియోజకవర్గ ప్రజలు తనపై విశ్వాసం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు బాధ్యతగా పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికే పల్లి గ్రామంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెంట లక్ష్మీబాయి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో, అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలోని 149 గ్రామాల్లో బతికేపల్లి గ్రామానికి ఒక ప్రత్యేకత ఉందని మంత్రి తెలిపారు. సుమారు 7వేల ఓటర్లు ఉన్న బతికే పల్లి గ్రామం గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదని మంత్రి తెలిపారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన నియోజకవర్గ ఓటర్ల సమస్యలే పరిష్కారం ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని మంత్రి తెలిపారు. బతికే పల్లి గ్రామంలో రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణంతో పాటు మహిళా సంఘాల భవన నిర్మాణం, కుల సంఘాల భవన నిర్మాణాలతో పాటు పల్లె దవాఖాన మరియు ఇతర మౌలిక వసతులు కల్పనకు తన వంతుగా సహకరిస్తానని మంత్రి వివరించారు. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా నిధులు కేటాయించి బతికేపల్లి అభివృద్ధికి కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ భూములను రక్షించాలి

**-కేంద్రీయ విద్యాలయానికి భూమిని కేటాయించాలి**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,మే 16 :** జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూములను రక్షించాలని, కేంద్రీయ విద్యాలయానికి భూమిని కేటాయించాలని కోరుతూ బిజెపి నాయకులు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్సింగాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 437, 251లో ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసుకొని ఆ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సాధారణంగా ఇటుక బట్టీలు నిర్వహించాలంటే నాలా కన్వర్షన్, ఇతర ప్రభుత్వ అనుమతులు అవసరమని, కానీ ప్రభుత్వ భూములను ఆక్రమించి వాటిని పట్టా భూములుగా చూపిస్తూ అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నర్సింగాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 437లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని అక్కడే కేంద్రీయ విద్యాలయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ప్రభుత్వ భూములు రక్షించబడటమే కాకుండా జిల్లాలోని పేద విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు అందుబాటు లోకి వస్తాయని తెలిపారు. ఎంపి ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇద్దరు సహకారంతో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చర్యలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేకపోతే కేంద్ర నిధులు వృథా అయ్యే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏసిఎస్ రాజు,సీపెల్లి రవీందర్,లింగం పేట శ్రీనివాస్,కౌన్సిలర్ అరవ లక్ష్మి, అంకర్ సుధాకర్,నరెందుల శ్రీనివాస్,బాశెట్టి ప్రభాకర్,లింగాల శ్రీకాంత్ రావు, ఠాకూర్ కిషోర్ సింగ్,ఎడమల వెంకట్ రెడ్డి, పోరండ్ల భిక్షపతి, ఇత్తడి రాజి రెడ్డి,నవ్వోతు సురేశ్, నాయిని సంజీవ రావు,ఎర్ర శ్రీనివాస్,గోడిశేల నాగరాజు, బుర్ర ప్రమోద్, బిట్టు,సరేల మహేష్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈనెల 20వ తేదీన మెడికల్ షాపుల బంద్

**-ఆన్లైన్లో మెడిసిన్ అమ్మకాలను నిషేధించాలని**
**కార్పొరేటు షాపుల్లో అధిక మోతాదులో డిస్కౌంట్లు ఆపాలని**
**స్పూరియస్ మెడిసిన్ అవైడ్ చేయాలనే మూడు డిమాండ్లతో**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మే 16 :** ఈనెల 20వ తేదీ బుధవారం రోజున ఆల్ ఇండియా కెమిస్ట్స్ అసోసియేషన్ (ఉూ×ూజణ) ఒక్కరోజు స్ట్రైక్ పిలుపుమేరకు ఎల్లారెడ్డిపేట మండలం లోని కెమిస్ట్రా అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పై మూడు డిమాండ్లతో మెడికల్ షాపులు 20వ తేదీన బంధు నిర్వహించబడును ఇట్టి బందుకు ప్రజలు సహకరించాలని మండల అసోసియేషన్ తరపున తెలియజేయునైనది. ఏదైనా అత్యవసర పరిస్థితిలో మండల కేంద్రంలోని అశ్విని హాస్పిటల్ లో గల కావేరి మెడికల్ అందుబాటులో ఉండును.మరిఏదైనా సమాచారా నిమిత్తం ప్రెసిడెంట్ బొమ్మకంటి రాజయ్య 9441195803, ప్రధాన కార్యదర్శి పొన్నాల బాల్ రెడ్డి 9848989741, కోశాధికారి గ్రామభీమేశ్వర్ 996321 3567 నెంబర్లలో సంప్రదించవచ్చునని అధ్యక్షులవారు తెలిపినారు.

# ధాన్యం కొనుగోలు సమర్ధవంతంగా నిర్వహించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి, మే 16 :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్ధవంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. ఈ నేపథ్యంలో శనివారం గోర్లవీడు గ్రామంలోని వెంకటేశ్వర రైస్ మిల్లు, కొండంపేటలోని వెంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మిల్లుల్లో ధాన్యం దిగుమతుల విధానం,నిల్వ పరిస్థితులు,నాణ్యత ప్రమాణాలు, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మిల్లుల్లో నిల్వ ఉంచిన ధాన్యం స్టాక్‌లను తనిఖీ చేసి,సంబంధిత రికార్డులను పరిశీలించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో ధాన్యాన్ని విక్రయిస్తున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మిల్ యాజమాన్యానికి సూచించారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని,వాహనాలు ఎక్కువసేపు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అక్నాలెడ్జ్‌మెంట్‌లను వెంటనే క్లియర్ చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను ప్రతి మిల్లులో కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ధాన్యం నిల్వ, రవాణా, రికార్డు నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని హెచ్చరించారు.అదేవిధంగా జిల్లాలో ట్యాబ్ ఎంట్రీల ప్రక్రియను ప్రతిరోజూ క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా సహకార అధికారిని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన 100 శాతం ట్యాబ్ ఎంట్రీలు 24 గంటలలోపు నమోదు అయ్యేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ట్యాబ్ ఎంట్రీలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, సోమవారం నాటికి కనీసం 90 శాతం ఎంట్రీలు పూర్తి అయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి అవాంతరాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీలో జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కిరణ్ కుమార్, జిల్లా మేనేజర్ రాములు, అసిస్టెంట్ సివిల్ సప్లైస్ అధికారి వేణు, సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## జన్మదిన సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**చురకలు విలేఖరి వీణవంక మే 16 :** వీణవంక మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ గజ్జల మొగిలయ్య జన్మదిన సందర్భంగా ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లతోపాటు స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం పోతిరెడ్డిపల్లె యూత్ నాయకులు వొల్లాల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలి వద్ద కేక్ కట్ చేశారు. ఐలవేణి కుమార్,సుమన్, రమేష్, తిప్పని ప్రశాంత్ గౌడ్, గజ్జల శ్రీకాంత్, ప్రకాశ్,సునీల్, రాకేష్,వివేక్,అభిలాష్ ఉన్నారు.

## పేరెంట్స్ మ్యారేజ్ డేకి కొడుకు ఐ డొనేషన్‌కు అంగీకారం

**- స్ఫూర్తిగా నిలిచిన 'ఖని' యువకుడు భగత్**



**చురకలు ప్రతినిధి,గోదావరిఖని మే 16 :** గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన బోసెట్టి భగత్ ప్రశాంత్ అనే యువకుడు సమాజానికి ఆదర్శంగా నిలిచే నిర్ణయం తీసుకున్నాడు. ఆర్ఎఫ్‌సీఎల్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న భగత్... శనివారం తన తల్లిదండ్రులు బోసెట్టి లక్ష్మి – నాగేశ్వరరావుల పెళ్లిరోజు సందర్భంగా తన మరణానంతరం నేత్రదానం చేస్తానని ప్రకటించి సేవాభావాన్ని చాటుకున్నాడు. ఈ మేరకు నేత్రదాన అంగీకార పత్రాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసుకు అందజేశాడు. భగత్ ప్రశాంత్ తీసుకున్న స్ఫూర్తిదాయక నిర్ణయాన్ని అభినందిస్తూ, జిల్లా జర్నలిస్టు సంఘం ఎథిక్స్ కమిటీ కో-కన్వీనర్ పందిళ్ల శ్యామ్‌సుందర్ చేతుల మీదుగా సదాశయ ఫౌండేషన్ ద్వారా ప్రశంసాపత్రాన్ని భగత్ కు అందించారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ.. నేటి యువత నేత్ర, అవయవ, శరీర దానాలపై ముందుకు రావాలని సూచించారు. ఒకరి నేత్రదానం ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపగలదని పేర్కొన్నారు. కార్యక్రమంలో దబ్బేట శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

# కాంస్య పతకం సాధించిన పల్లి ఉమారాణి

**-అభినందించిన సి పి**



**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, మే 16 :** ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఘనంగా నిర్వహించిన అఖిల భారత పోలీస్ క్రీడా పోటీల్లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఉమెన్ ఏఎస్సై పల్లి ఉమారాణి అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారుఈ నెల 9 నుండి 13 వరకు లక్నోలో జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీలలో, ఉమారాణి ఉమెన్ డబుల్స్ 50 ఏళ్ళ వయసు విభాగంలో తెలంగాణ పోలీస్ శాఖ తరపున ప్రాతినిధ్యం వహించి, కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్ర పోలీస్ శాఖకు ఆమె మంచి పేరు తీసుకువచ్చారు.పోటీలు ముగించుకొని నగరానికి చేరుకున్న ఏఎస్సై పల్లి ఉమారాణి శనివారంనాడు కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె సాధించిన కాంస్య పతకాన్ని, సర్టిఫికేట్‌ను సీపీకి చూపించారు.ఉమారాణి ప్రతిభను సీపీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.50 ఏళ్ల వయసులోనూ విధి నిర్వహణతో పాటు క్రీడల్లో ఈ స్థాయి ప్రతిభ కనబరచడం ఎందరికో స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని సీపీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొని ఉమారాణికి అభినందనలు తెలిపారు.

# చలివేంద్రం కూల్చివేతపై బాధ్యులపై చర్యలు చేపట్టాలి

**-ప్రజాహిత కార్యక్రమాలపై కక్ష ఎందుకు...?**
**-మాజీ సర్పంచ్ లావణ్య నాగరాజు డిమాండ్**
**-సొంత పార్టీ వారిదే హస్తం...?**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (ముస్త్యాల) , మే 16 :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో ప్రజాహిత కార్యక్రమాలు చేపడితే సొంత పార్టీ వారే కక్ష సాధింపు చేస్తున్నారని దీనికి కారణమేమిటి అని తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య నాగరాజు అన్నారు.ముస్త్యాల ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కొందరు సొంత పార్టీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు లారీతో కూల్చివేశారనీ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ సామాజిక కార్యకర్త రామగిరి లావణ్య నాగరాజ్ ఆరోపించారు. స్వంత ఖర్చులతో నిర్మించిన చలివేంద్రాన్ని ధ్వంసం చేశారని ఆమె ఆరోపించారు. ఘటనపై పోలీసులు పరిశీలన చేపట్టారు. కానీ ఈ ఘటన కు బాధ్యులైన అందరిపై చట్ట పరంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ఉన్న సిమెంట్ బెంచీలు, షెడ్, నీటి డ్రమ్ములను ధ్వంసం చేశారని లావణ్య ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాన్ని రాజకీయ కక్షతో అడ్డుకోవడం బాధాకరమన్నారు. నిందితులపై మరియు లారీ ఓనర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ ఘటనపై గ్రామస్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, పూర్తి స్థాయి విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

# జిల్లాలో వేగవంతంగా ధాన్యం కొనుగోలు

**-రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు**
**-లారీలు వ్యాన్లు ట్రాక్టర్లలో తరలింపుకు అనుమతి**
**ప్రత్యామ్నాయ గోదాంలో ధాన్యం దిగుమతి**
**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మే 16 :** జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతంగా కొనసాగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సిరిసిల్ల అపెరల్ పార్క్ లోని షెడ్ లలో వరి ధాన్యం దిగుమతి ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఇప్పటిదాకా ఎన్ని లారీలు వచ్చాయి? ఎన్ని అన్లోడింగ్ చేశారు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోల ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని వారు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు ఈసారి ధాన్యం తరలింపులో లారీలు, వ్యాన్లు, ట్రాక్టర్లు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. దాన్యం దిగుమతి కోసం సిరిసిల్ల అపెరల్ పార్క్ లోని షెడ్ లలో వాడుకునేందుకు ప్రభుత్వ అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. ఇక్కడ హమాలీలు వెంటవెంటనే ధాన్యం దిగుమతి చేస్తున్నారని తెలిపారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భోజన, వసతి, వైద్య సదుపాయం కల్పిస్తున్నారని వివరించారు. రైతులెవరు ఆందోళన చెందవద్దని ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు వస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. గతంలో కంటే ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు తుమ్మల నాగేశ్వరరావు అందరి సహకారంతో దాన్యం కొనుగోలు ప్రక్రియ సాగుతుందని పేర్కొన్నారు.

# రైతులు అధైర్య పడవద్దు ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

**-వడ్ల కటింగ్ లేకుండా కొనుగోలు చేసే నియోజకవర్గం పెద్దపల్లి**
**-మక్కల కొనుగోలు వేగవంతం చేయండి**
**-పెద్దపల్లి నియోజకవర్గంలో రైతు రాజ్యం నడుస్తుంది**
**-ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 16 :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వరిధాన్యం మరియు మక్కలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింత కుంట విజయరమణరావు ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...వేసవికాలం ఎండ అధికంగా ఉందని దీంతో పాటు హమాలి కొరత కూడా కొంత ఉందని అన్నారు. ఐకెపి, సింగల్ విండోస్ సొసైటీ ద్వారా వరి ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని ఈ వేసవిలో నాలుగున్నర మెట్రిక్ టన్నుల వరి పండినట్లు సివిల్ సప్లై అధికారులు లెక్కలు చెబుతున్నారని అధిక ఎండా కారణంగా మిల్లులో దిగుమతికి కొంత సమయం పడుతుందని అన్నారు.మే 25వ తేదీ వరకు మూడున్నర లక్షల టన్నుల వరి ధాన్యం కొనాలని ప్రభుత్వం,జిల్లా కలెక్టర్,సంబంధిత అధికారులు కూడా దృష్టి పెట్టి పని చేయడం జరుగుతుంది అన్నారు.ఈ నియోజకవర్గంలో మొక్క జొన్నలు కూడా 11 సెంటర్లో రైతులను తీసుకోవడం జరుగుతుందని, మొక్కజొన్న రైతులు కూడా అధైర్య పడవద్దని ఒక గింజ లేకుండా జొన్నలు కొనడం జరుగుతుంది అన్నారు. మొక్క జొన్న రైతులు గన్ని సంచులు కొనుక్కుంటే ప్రభుత్వం గన్ని సంచుల ఒక్కొక్కరికి 21 రూపాయిలు ఆ తదుపరి ఇస్తుందని సెంటర్ ఇంచార్జ్ నిర్వహణ ఖాతాలో వేస్తుందని వారు గన్నీ సంచులు కొనుక్కున్న రైతులకు ఇస్తారు అన్నారు. ప్రభుత్వం మొక్కజొన్నలకు రూపాయలు 2400 మద్దతు ధర ఇస్తుంది అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న రాధాంతాలు రైతులు నమ్మవద్దు అన్నారు.చుట్టుప్రక్కల వరి ధాన్యం కటింగు ఉందని మన నియోజకవర్గంలో లేకపోవడంతో ప్రతిపక్షాలు ఏదోరకంగా ఎన్ని రాజకీయ కుట్రలు చేసిన రైతులు పట్టించుకోకూడదు అన్నారు.10 సంవత్సరాలు గత ప్రభుత్వంలో రైతులు కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం కటింగుతో ఎంత ఇబ్బంది పడ్డారో మీకే తెలుసని, ప్రస్తుతం వరిధాన్యం కటింగ్ లేక పోవడం వలన ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదు అన్నారు. ప్రస్తుతం 60 శాతం వరకు వరి ధాన్యం అమ్మడం జరిగిందని మరో 40శాతం 15 రోజుల లో పూర్తిచేయడం జరుగుతుంది అన్నారు.అనుకోకుండా వర్షం వస్తే రైతులు మొక్కలు తడవకుండా జాగ్రత్త పడాలని, మొక్కల కొనుగోలు కూడా త్వరలో పూర్తి చేయడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పలు గ్రామాల సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# న్యాయపరమైన హక్కులను తెలుసుకోవాలి

**-అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల**




**చురకలు ప్రతినిధి,జయశంకర్ భూపాలపల్లి, మే 16 :** డబ్బులు, ఉద్యోగాల ఆశ చూపించి మహిళలను, చిన్నపిల్లలను లొంగదీసుకుంటారని ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల అన్నారు.జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా బాధితులు, లైంగిక దోపిడీ అనే అంశం పై శనివారం సమావేశం నిర్వహించారు. పట్టణంలోని సఖి సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో జడ్జి అతిధిగా హాజరయ్యి ప్రసంగించారు. జిల్లాలో వెనకబాటుతనం ఉందని, దాన్ని ఆసరాగా చేసుకొని నేరస్థులు మోసాలు చేస్తారని అన్నారు. ప్రజల్లో విరివిగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నేరాలు జరగకుండా కట్టడి చేయవచ్చుని తెలిపారు.ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పి. శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయ, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, సి.డి.పి.ఓ. రాధిక, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ గాయత్రీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ అసిస్టెంట్ జి. సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి మంత్రికి విజ్ఞప్తి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 16 :** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కు బోయిన్ పేట్ సమస్యలపై వినతి పత్రం కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి అందించారు. శనివారం హైదరాబాద్ లోని మినిస్టర్ కార్యాలయంలో ఐటీ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు ని మర్యాదపూర్వకంగా కలసి బోయిన్ పేట్ సమస్యలపై 6వ వార్డ్ ఇండిపెండెంట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి వినతి పత్రం అందజేశారు.సమస్యలపై సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యలు పరిష్కారిస్తామని హామీ అందించిన మంత్రివర్యులు శ్రీధర్ బాబు కి ధన్యవాదములు తెలిపారు.అనంతరం మంత్రి శ్రీధర్ బాబును కౌన్సిలర్ దంపతులు ఘనంగా సన్మానించారు.

## మహిళలకు చేయూతనిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 16 :** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మహిళా మణులకు చేయూతనివ్వడం జరుగుతుందని మంథని మండలం కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య అన్నారు. మంథని మండలం కన్నాల గ్రామంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ శిబిరం 24 రోజులపాటు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. చేసి ఐటి శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో అలీఫ్ సంస్థ వారు కన్నాల గ్రామంలోని 30 మంది మహిళలకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది .ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతో అన్ని రంగాలలో ముందు ఉండాలని గ్రామసర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుట్టు మిషన్ ట్రైనర్ కనక లక్ష్మి మరియు వార్డు సభ్యులు కీర్తన గ్రామ మహిళలు మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

## నేడు సర్పంచులతో సమావేశం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 16 :** మూడు మండలాల పలువురు సర్పంచులతో ప్రత్యేక సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని కమాన్ పూర్ మండలం గుండారం గ్రామ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాసి మల్ల సుధాకర్ పేర్కొన్నారు. ఇందులో కమాన్ పూర్ మండలంలోని కమాన్ పూర్, జూలపల్లి, పెంచికల పేట, సిద్ది పల్లె, నాగారం, రొంపి కుంట, పేరా పల్లి, గొల్లపల్లి, గుండారం, తోపాటు రామగిరి మండలంలోని కల్వచర్ల, రత్నాపూర్, పన్నూరు, నాగేపల్లి, బేగంపేట, ఆదివారం పేట, శ్రీ లధన పూర్ , రాజాపూర్ లొంక కేసారం, అలాగే పెద్దపల్లి మండలంలోని సబితం, రంగాపూర్, రాఘవాపూర్ గ్రామాల సర్పంచులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కళాశాల లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించడం జరుగుతుందని సుధాకర్ పేర్కొన్నారు. ప్రతి సర్పంచ్ తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## కరీంనగర్ పార్లమెంట్‌లో పార్టీపై కాంగ్రెస్ దృష్టి



**చురకలు విలేఖరి,కరీంనగర్ మే 16 :** కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత బలోపేతం, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), మండల కమిటీల పూర్తి తదితర అంశాలపై కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది.శనివారం హైదరాబాద్ లోని మంత్రి క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో పలు అంశాలపై కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జులు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సమావేశం నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో అర్హులైన నిరుపేదలు ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందినప్పుడే పథకాల లక్ష్యం నెరవేరుతుందని సమావేశం అభిప్రాయపడింది. అందుకే గ్రామాల్లో పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఈ విషయంలో డీసీసీ అధ్యక్షులు మండలాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించాలని నిర్దేశించారు.

**కొనుగోళ్లలో క్రియాశీలకంగా పని చేయాలి**

ప్రభుత్వ పరంగా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నాయకులు క్రియాశీలకంగా వ్యవహరించాలని సమావేశంలో నిర్ణయించారు. కొనుగోళ్ల వ్యవహారంలో రైతులు ఇబ్బందులు పడకూడదని, ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు తోడ్పడాలని సమావేశం అభిప్రాయపడింది.

**సీనియర్ల ప్రాధాన్యం కల్పించాలి**

కష్టకాలం నుంచి కాంగ్రెస్ పార్టీ లో పని చేస్తున్న నాయకులను గుర్తించి వారికి ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది. సీనియర్ల సేవలను వినియోగించుకునే విధంగా వారికి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు కట్టబెట్టాలని సమావేశం పార్టీ అధిష్టానాన్ని కోరింది. అంతేకాకుండా నామినేటెడ్ పదవుల్లో మూడు సంవత్సరాల ప్రమాణాన్ని పాటించేలా చూడాలని సూచించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియపై పార్టీశ్రేణులు జాగరూకతతో వ్యవహరించాలని సమావేశం కోరింది. ముఖ్యంగా నియోజకవర్గ ఇంచార్జీలు, కో-ఆర్డినేటర్లు అప్రమత్తంగా ఉండాలని సమావేశం దిశానిర్దేశం చేసింది.అనంతరం ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌లతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, సిరిసిల్ల , హుజూరాబాద్ నియోజకవర్గాల ఇన్చార్జీలు కేకే మహేందర్ రెడ్డి, ఒడితల ప్రణవ్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, వెంకటరమణ, రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, ఆదేం రాజ్ దేశపతి, సౌజన్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామంలో ఉన్న కొత్త సురేష్, జి.కె.ఎస్ మరియు



అమీర్ రైస్ మిల్లులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లులలో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్ మరియు అన్ లోడింగ్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, మిల్లింగ్ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధాన్యం నిర్వహణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాలసదన్‌ను సందర్శించిన న్యాయమూర్తి

**చురకలు విలేకరి, జగిత్యాల, మే 16 :** జగిత్యాల జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ బదిలీ నేపథ్యంలో తన చివరి అధికారిక పర్యటనగా జగిత్యాల బాలసదన్ను సందర్శించారు.ఈ సందర్భంగా బాల సదన్లో లీగల్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బాలికలకు న్యాయ అవగాహన, బాలల హక్కులు, మహిళల రక్షణ చట్టాలు, విద్య యొక్క ప్రాముఖ్యత, సమాజంలో ధైర్యంగా ముందుకు సాగాల్సిన అవసరంపై వారు విలువైన సందే




శాలను అందించారు. ప్రతి విద్యార్థిని తన లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని, చట్టంపై అవగాహన కలిగి ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.బాలసదన్ విద్యార్థి నులు మరియు సిబ్బంది న్యాయమూర్తి వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ ఘనంగా సన్మానించి, ఆయన జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా అందించిన సేవలను కొనియాడారు.ఆయన హయాంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమాలు,ఉచిత న్యాయ సహాయం మరియు ప్రజలకు చేరువైన సేవలు సమాజంలో విశేష గుర్తింపు పొందా యని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ కే. చంద్రమోహన్, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సిహెచ్. అనురాధ, సూపరింటెండెంట్ ఆఫ్ డిఎల్ఎస్ఎ వెంకన్న, బాలసదన్ సిబ్బంది, విద్యార్థినులు, ఇతర డిఎల్ఎస్ఎ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్వల ప్రాజెక్టు పునరుద్ధరించండి

**-రూ.70 కోట్లు మంజూరు చేయండి**

**-కల్వల ప్రాజెక్టుతో ఎనిమిది వేల ఎకరాల్లో పంటల సాగు**

**-మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ మే 16 :** శంకరపట్నం మండలం లోని ప్రసిద్ధ కల్వల ప్రాజెక్టును పునరుద్ధరించాలని తద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శనివారం రాష్ట్ర రాజధాని హైదరాబాదు లోని సెక్రటేరియట్లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. గతంలో కల్వల ప్రాజెక్ట్ తెగిపోయిందని, తద్వారా రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లాడు. కల్వల ప్రాజెక్టు ఆయకట్టు కింద శంకరపట్నం, జమ్మికుంట, వీణవంక మండలాల్లో 8 వేల ఎకరాలు సాగవుతోందని ఆయన తెలిపారు.కల్వల ప్రాజెక్టు పునర్నిర్మాణానికి 70 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని ఇప్పటికే ప్రతిపాదనలు కూడా అధికారులు ప్రభుత్వానికి సమర్పించారని ఎమ్మెల్యే వివరించారు. తనను కేవలం ప్రతిపక్ష ఎమ్మెల్యేగా పక్షపాతంతో చూడకుండా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిధులు మంజూరు చేయాలని తద్వారా రైతులకు న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.



# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు అభినందనీయం

**-మేనిఫెస్టో హామీలను అమలు చేయాలని ఉద్యమకారుల డిమాండ్**

**చురకలు ప్రతినిధి,మంథని, మే 16 :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకుడు ఎక్కేటి అనంతరెడ్డి, మంథని విజయ్ కుమార్, వేల్పుల గట్టయ్య లు మాట్లాడుతూ 2001లో కేసీఆర్ ప్రారంభించిన జలదృశ్యం ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ప్రస్తుతం ఉన్న 33 జిల్లాల్లో వేలాది మంది ఉద్యమకారులు వివిధ రూపాల్లో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు, ఉద్యమాలు జరిగాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ నిర్ణయమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల చూపిన చొరవ అభినందనీయమని తెలిపారు. అదేవిధంగా మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ఉద్యమకారులకు బస్సు పాస్, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన నిజమైన ఉద్యమకారులను మాత్రమే గుర్తించి, తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన నాయకులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గడ్డం వివేక్, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో పాటు తమ పదవులకు




రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమానికి మద్దతు తెలిపిన నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఉద్యమకారుల గుర్తింపు కమిటీలో భాగమైన కే. కేశవరావు, ప్రొఫెసర్ కోదండరాం వంటి నాయకులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో గోగుల రాజిరెడ్డి, గుర్రం దేవేందర్, జాడి జంపయ్య, జిముడ కొండన్న, కాసిపేట సాంబయ్య, ముస్కుల ప్రభాకర్ రెడ్డి, తాటి బుచ్చన్న, కుంట బద్రి, రొడ్డ లింగయ్య, మంథని సాయి కుమార్, కందెల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

**-కరీంనగర్ సిపి గౌష్ ఆలం**
**-గోవుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం**
**- కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 6 చెక్‌పోస్టుల ఏర్పాటు**
**-హిందూ మత సంఘాల ప్రతినిధులతో సీపీ సమీక్షా సమావేశం**




**చురకలు ప్రతినిధి కరీంనగర్, మే 16 :** రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. శనివారం నాడు కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో విశ్వ హిందూ పరిషద్ , బజరంగ్ దళ్, గోరక్ష ప్రముఖ్ తదితర హిందూ మత సంఘాల ప్రతినిధులతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, పండుగ వేళ ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. పశువుల అక్రమ రవాణా లేదా గోవధకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా తక్షణమే పోలీసులకు తెలియజేయాలే తప్ప చట్టాన్ని ఉల్లంఘించకూడదని హెచ్చరించారు. అలా కాదని చట్టాన్ని అతిక్రమిస్తే 'తెలంగాణ గోవధ నిషేధ మరియు జంతు సం రక్షణ చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు.

**గోవుల అక్రమ రవాణాపై పూర్తి నిషేధం - పటిష్ట నిఘా**

రాష్ట్రంలో గోవుల అక్రమ రవాణాను పూర్తిగా నిషేధించినట్లు సీపీ తెలిపారు. పశువుల రవాణాకు సంబంధించి నిబంధనలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు:రవాణా చేసే పశువులకు సంబంధించి వెటర్నరీ డాక్టర్లు జారీచేసే 'ఫిట్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్' పత్రాలు తప్పనిసరిగా తనిఖీ చేస్తారు.

**6 వ్యూహాత్మక ప్రాంతాలలో చెక్‌పోస్టులు**

పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 121 చెక్‌పోస్టులు, 52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని.. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా 6 చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు.

**చెక్‌పోస్టుల వివరాలు :**

1. కరీంనగర్ రూరల్ లోని ముగ్దుంపూర్, 2. కరీంనగర్ కొత్తపల్లి మండలం చింతకుంట, 3. చొప్పదండి మండలం ఆర్నకొండ, 4. గంగాధర మండలం తుర్కాసినగర్5. తిమ్మాపూర్ మండలం రేణికుంట, 6. హుజురాబాద్‌లోని పరకాల క్రాస్ రోడ్డు

**రెండు వారాల పాటు ఆకస్మిక తనిఖీలు**

ఈ చెక్‌పోస్టుల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సరిపడా పోలీసు సిబ్బందిని కేటాయించామని, రానున్న రెండు వారాల పాటు నిరంతరం మరింత పటిష్ట భద్రతను కొనసాగిస్తామని సీపీ తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించి పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, రవాణాకు ఉపయోగించిన వాహనాలను కూడా సీజ్ చేస్తామని సీపీ హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రథమ ప్రాధాన్యతని, అందరూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, హిందూ సంఘాల పెద్దలు ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను రక్షించాలి

**-కేంద్రీయ విద్యాలయానికి భూమిని కేటాయించాలి**



చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 : జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూములను రక్షించాలని, కేంద్రీయ విద్యాలయానికి భూమిని కేటాయించాలని కోరుతూ బిజెపి నాయకులు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్సింగాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 437, 251లో ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసుకొని ఆ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సాధారణంగా ఇటుక బట్టీలు నిర్వహించాలంటే నాలా కన్వర్షన్, ఇతర ప్రభుత్వ అనుమతులు అవసరమని, కానీ ప్రభుత్వ భూములను ఆక్రమించి వాటిని పట్టా భూములుగా చూపిస్తూ అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నర్సింగాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 437లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని అక్కడే కేంద్రీయ విద్యాలయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ప్రభుత్వ భూములు రక్షించబడటమే కాకుండా జిల్లాలోని పేద విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఎంపి ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇద్దరు సహకారంతో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చర్యలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేకపోతే కేంద్ర నిధులు వృథా అయ్యే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏసిఎస్ రాజు, సీపెల్లి రవీందర్,లింగం పేట శ్రీనివాస్, కౌన్సిలర్ అరవ లక్ష్మి, అంకర్ సుధాకర్, నరెందుల శ్రీనివాస్, బాశెట్టి ప్రభాకర్, లింగాల శ్రీకాంత్ రావు,ఠాకూర్ కిషోర్ సింగ్, ఎడమల వెంకట్ రెడ్డి, పోరండ్ల భిక్షపతి, ఇత్తడి రాజి రెడ్డి,నవ్వోతు సురేశ్, నాయిని సంజీవ రావు, ఎర్ర శ్రీనివాస్, గోడిశెల నాగరాజు, బుర్ర ప్రమోద్, బిట్టు, సరేల మహేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలి

**-కలెక్టర్ కుమార్ దీపక్**



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 16 :** విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో విద్యా వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన కళలు,హస్త కళలు, సాంస్కృతిక దినోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో విద్యా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కోలాటం,తోలుబొమ్మలాట,బొమ్మల ప్రదర్శన, పేరిణి శివతాండవం,ఒగ్గు కథ, లంబాడి/ ఆదివాసి నృత్యం,చిత్రలేఖనం, హస్తకళలు వంటి అంశాలలో విద్యార్థులు ఆసక్తి కలిగి ఉండాలని, కళలతో పాటు క్రీడా రంగంలో రాణించాలని తెలిపారు. వివిధ రంగాలలో నైపుణ్యత సాధించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని,టీంవర్క్ పై అవగాహన కలుగుతుందని తెలిపారు. ఏ రంగంలో అయినా గెలుపు, ఓటములు ముఖ్యం కాదని ప్రయత్నించడం మొదటి విజయమని తెలిపారు. వేసవిలో విద్యార్థుల కొరకు ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, వివిధ అంశాలలో విద్యార్థులకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఉద్రిక్తత



**-కేంద్రీయ విద్యాలయానికి స్థల కేటాయింపుకు బిజెపి నిరసన**
**-మహిళా నాయకురాలు డాక్టర్ భోగ శ్రావణిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 16 :** జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నెల 18న నిర్వహించనున్న ఎంపీ ధర్మపురి అరవింద్ ధర్మదీక్షకు పోలీసులు అనుమతులు నిరాకరించడంతో బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ భోగ శ్రావణి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. జగిత్యాల విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రీయ విద్యాలయం అవసరమంటూ బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రభుత్వం కావాలనే కేంద్రీయ విద్యాలయ ఏర్పాటును అడ్డుకుంటోందని ఆరోపించారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో పోలీసులు భారీగా మోహరించి నిరసనకారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో డాక్టర్ భోగ శ్రావణితో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో డాక్టర్ భోగ శ్రావణికి స్వల్ప గాయాలయ్యాయి. తమ నాయకురాలిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ భోగ శ్రావణి తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీస్ స్టేషన్కు తరలించారు. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భోగ శ్రావణి మాట్లాడుతూ జగిత్యాల యువతకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తాము పోరాటం చేస్తున్నామని, ధర్మదీక్షకు అనుమతి ఇవ్వకుండా ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని, పోలీసులు బలప్రయోగంతో ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్నారని, అయినా తమ పోరాటం ఆగదన్నారు.

## కాసిపేట 1ఏ టన్నల్‌లో

# మంచి నీటి కూలర్ ఏర్పాటు



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, మే 16 :** కాసిపేట 1ఏ లో జనరల్ మేనేజర్ రాధ క్రిష్ణ ఆదేశాల మేరకు శనివారం కార్మికులకు చల్లని మంచి నీటిని అందించాలని కొత్త వాటర్ కూలర్ ను ఏర్పాట్లు చేశారు. మేనేజర్ సతీష్ కూలర్‌ను ప్రారంభించారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడం, కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యం తో మంచి నీటి కూలర్ ను ప్రారంభించడం జరిగిందని మేనేజర్ సతీష్ అన్నారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస అవసరాలైన మంచినీటిని అందించేందుకు కృషి చేయడం జరిగింది దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషాన్,బన్న లక్ష్మన్ దాస్,పార్వతి సురేష్,వినోద్ తదితరులు పాల్గొన్నారు.